# పశ్చాత్తప్త చిత్తుడు

శ్రీ శ్రీనివాసపురం రామాచార్యులు

"ఇదిగో! ఈ ఉత్తరాన్ని మీవాళ్ళు రాశారు; చదువుకో!" అని జేబులోనుంచీ ఒకవరుతీసి రమముఖాని కేసి కొట్టాడు రమేశ్.

"ఎందుకండీ నామీద మీకంతకోపం? అసలు నేనేమి తప్పుచేశానని మీరలా యిదయిపోతున్నారు? నేనంటే బొత్తిగా పడనట్టుందే!" అని రమ వంగి క్రిందబడిన కవరు యెత్తుకొంటూ అంది.

రమేశ్ కోపంతో మాటాడకండా బయటికి వెళ్ళిపోయినాడు.

కవరులోని కాగితంతీసి చదువుకుంది రమ — నాన్న తనని పండక్కి పిల్చుకొనిపోవటానికి అమ్మని పంపిస్తున్నానని వ్రాసినజాబు అది. అంతేగానీ — మరే సంగతులూ అందులోలేవు! మరెందు కీయన కంతకోపం?- తనని పంపించటాని కీయన కిష్టంలేదేమో! ఇష్టంలేక పోతే పంపించటానికి వీల్లేదని ఖచ్చితంగా వ్రాసి పారెయ్యొచ్చు గానీ — ఈకోపాలూ; ఈ తాపాలూ యెందుకు? అనుకుంది.

ఐదు నిమిషాలు గడచిపోయినాయి. రమేశ్ తిరిగి వచ్చి: "ఏం! చదవడం పూర్తయిందా?" అన్నాడు కోపం వ్యక్తపరచే ధోరణిలో.

"అయింది" మెల్లగా నిర్లిప్తతతో అంది రమ.

"అయితే నీ అభిప్రాయం?"

"మీరెలా చెప్పితే అలా చెయ్యడమే."

"నేను చెప్పడమంటూ ఒకటి ఏడిసిందీ? యిన్నాళ్ళూ-నీకిష్టముంటే వెళ్ళు. లేకపోతే మానెయ్యి" అని విసురుగా వెళ్ళిపోయినాడు రమేశ్ ఆఫీసుకి ... ......

రమేశ్ బాగా చదుపుకున్నవాడు. చక్కని ఆశయాలు. ఉత్తమసంస్కారం గలవాడు. అతనికి యిరవయ్యో యేటనే తల్లితండ్రుల నిర్బంధంవల్ల రమతో వివాహం అయిపోయింది. పెళ్ళి అయిరెండేళ్ళు అయింది. రమను పెళ్ళాట్టం అతనికిష్టం లేకపోయినా తలిదండ్రుల ఒత్తిడివల్ల వొప్పుకోక తప్పింది కాదు. రమేశ్ హృదయపందిరిలో తీయని భావాలు తీగల్లా అల్లుకున్నాయ్! తన భార్య అందాలరాణి అవాలి, బాగాచదువుకున్నదయి వుండాలి. తనని, తన భార్యనిచూచి అనుకూల దాంపత్యమంటే యేమిటో లోకు లర్ధంచేసుకోవాలి. తను సాయంత్రపువేళ తోటలోకూర్చుని ప్రకృతి రామణీయకతను తిలకిస్తూ యెంతసేపైనా వుండిపోగలడు. అలా వుండటమంటే తనకెంతో-సరదా. అలాంటప్పుడు తన ప్రేయసి మధురాతి మధురంగా పాడుతుంది. ఆచల్లని గాలిలో - చందమామ వెన్నెల్లోకలసి ఆగానం తన హృదయాన్ని పులకరింపజేస్తుంది — ఆ తీయనిపాట తనని పరవశుణ్ణిజేస్తుంది — తన హృదయంలో అమృతాన్ని వర్షిస్తుంది — తను తన్మయంలో మునిగిపోతాడు - ఎండిమోడువారిన తన హృదయక్షేత్రంలో మళ్ళీ ఆశాబీజం అంకురిస్తుంది — అలా పాట వింటూ లోకాన్నే మరచిపోగలడు తను .........

పాపం! రమేశ్ కోరికలు; ఆశయాలు అడుగంటిపోయినాయి. అత నూహించుకొన్న భవిష్యత్తు ఆనందదాయకమైంది. కానీ — అతననుకొన్నట్టు అతని భవిష్యజ్జీవిత మానందదాయకమవలేదు. అతని కోరికలు కొనసాగలేదు. హృదయం నిరాశానిస్పృహలతో నిండిపోయింది. ఆనంద మణుమాత్రమైనాలేదు. రమతో వివాహమైపోయింది. ఆమె ద్వారా తన కోరికలు నెరవేరుతాయనుకోవటం వట్టి భ్రమమాత్రమే! అవి అలా అంతరించిపోవాల్సిందే! అనుకున్నాడు.

రమ అంగవిహీనకాదు — అనాకారికాదు - మూర్ఖురాలూకాదు. అంతోయింతో చదువుకుంది. మానవ హృదయాలను అర్ధం చేసుకోగలపాటి పరిజ్ఞానంకూడా వుంది. ఈర్ష్య, క్రోధాలు ఆమెలో అణుమాత్రమైనాలేవు. ఆమె హృదయం నిర్మలమైంది. భర్తే తన సర్వస్వం. ఆయన ఆశయాల కనుగుణంగా ప్రవర్తించాలి, ఆయన తన్ని కాపాడేదైవం. ఆయనపట్ల ఏమాత్రం నిరసనభావం చూపరాదు. తన విధ్యుక్తధర్మాన్ననుసరించి తను మసులుకోవాలి అనుకుంది. అనుకోవడమేమిటి? ఆచరించగలదుకూడా! కానీ, రమతో సంతోషంగా, ఆప్యా

యంగా ; ఒక్కరోజైనా మాట్లాళ్ళేదు రమేశ్. ఆమె మీద పూర్తిగా నిరాశ, నిస్పృహలను పొందాడు. రమ హృదయాన్ని అర్థం చేసుకోలేకపోయినాడు. ఆమెకూడా తనలాగేకోరికలూ, ఆశయాలూ పెట్టుకొని జీవిస్తోన్న ఒక వ్యక్తేనని అతను అనుకోలేకపోయినాడు.

భర్త ప్రవర్తన ఆమె లేతహృదయాన్నిగాయ పరచక పోలేదు. అతను పొందుతున్నబాధ ఏమిటో ఆమెకర్థం కావడంలేదు. తను తెలియక ఏమైనా తప్పుచేశానేమో ? అనుకుంది. కానీ — ఎంత పరిశీలించినా తనప్రవర్తనలో ఆమెకు 'తప్పు' అనేది కనబడలేదు. అతనికి వ్యతిరేకంగా తను ఏనాడూనడచుకోలేదు. అయినా భర్త తనతో సంతోషంగా వుండకపోవటానికి తను అతనికి చేసిన అపరాధమేమిటో తెలియలేదు — ప్రత్యహమూ ఈ ఆలోచనలతోనే రమ కుమిలిపోయేది. ఆమె హృదయం సముద్రంలాంటి దుఃఖంతో నిండిపోయేది....

రమ తల్లి వచ్చింది. నాలుగురోజులుండి ఐదోరోజు రమను వెంటబెట్టుకుని బయల్దేరింది. వాళ్ళను స్టేషన్ దాకా సాగనంపి రావటానికిగూడా రమేశ్‌కి యిష్టంలేక పోయింది. కానీ, అత్తగా రేమన్నా అనుకుంటారేమో నని వెళ్ళాడు.

రమ రైల్లో కూర్చున్న తర్వాత భర్తముఖంలో కొక సారి దీనంగాచూచింది. అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. తన యేడ్పుముఖాన్ని భర్తకు చూపించ లేక తలొంచుకుంది — రైలు కదిలిపోయింది........

రమేశ్ దైనికజీవితంలో మార్పేమీకలుగలేదు. రమ ఉన్నా లేకపోయినా ఒకటే అనుకుని రోజులు గడుప సాగాడు. రమ వెళ్ళి మూడువారాలైంది. అక్కణ్ణుంచీ ఉత్తరంగూడా రాలేదు. రమేశ్ ఆ విషయాన్నిగురించి ఆలోచనైనాచెయ్యలేదు. రమను పూర్తిగా మరచిపోవాలను కున్నాడు. కానీ, ఆరోజు రైల్లోకూర్చుని ఆమె దీనంగా తనవైపుచూస్తూ కార్చినకన్నీళ్ళు మరపుకు రావటంలేదు. అప్పుడప్పుడు ఆకన్నీళ్ళే రమను జ్ఞాపకంచేస్తుంటాయి.

• • •

ఆరోజు ఆదివారం. ఆఫీసుకి శెలవు. రమేశ్ మడత మంచంపై పడుకుని చదువుతున్నాడు. కానీ — అతనికి పుస్తకంపై ధ్యాసేలేదు. ఆలోచనా పరంపరలుపురుగుల్లా అతని బుర్రను తొలిచిపారేస్తున్నాయ్ ! మానసికంగా ఏదో బాధపడుతున్నాడు. చదువుతున్న పుస్తకాన్ని రొమ్ముపై నుంచుకుని కళ్ళుమూశాడు. అలా ఎంతసేపు నిద్రపోయాడో తనకే తెలీదు. కళ్ళుతెరచి చూచేసరికి పుస్తకం క్రిందబడి చిందరవందరగావుంది, దానిప్రక్కనే ఓమడతపెట్టిన కాగితంగూడా పడివుంది. రమేశ్ మెల్లగా లేచి - మొదట పుస్తకాన్ని యెత్తుకుని అవల ఆకాగితాన్ని తీసి ఆతురతతో మడతవిప్పాడు.

"ప్రభూ !

నామనోవేదనను మీకు తెలపటం యిదేమొదటిసారి. బహుశా యిదే కడపటిసారిగూడా అనుకుంటాను. ఇంత వరకూ మీకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఏ విషయమూ తెల్పకపోయినా యిప్పుడు అంటే, యీనాడు నా ఆవేదనను పూర్తిగా ఈ కాగితం ద్వారా మీకు తెలుపుకొంటున్నాను.

పూర్వజన్మ పుణ్యఫలమువల్లనే మీవంటి భర్తను పొందగలిగానని సంతోషపడ్డాను. సహజంగా అందరు స్త్రీలు కోరుకునేవిధంగానే, నేనూ మీవద్ద ప్రేమాదరణలు పొందాలని తహతహపడ్డాను. మీకనుగుణంగా ప్రవర్తిం చాలనుకున్నాను. మీభావాలతో, ఆశయాలతో యేకీభవిం చాలనుకున్నాను ......యింకా యేవేవో అనుకున్నాను. కానీ, నేననుకున్నదొక్కటీ జరుగలేదు. పెళ్ళిఅయిన మూడోరోజునుంచీ మీరు ఒరకంగా మారిపోయినారు. కనీసం నాతో మాటాడునప్పుడైనా సంతోషంగా వుండే వారుకాదు ; ముఖం చిట్లించుకుని, చిరచిర, కోపంవ్యక్త పరచేవారు. మీరు హటాత్తుగా అలా మారిపోవటానికి గల కారణమేమిటా ? అని కొన్నాళ్ళపాటు ఆలోచిం చాను. కానీ — రోజూ అలానే వుంటూండటంవల్ల మీ స్వభావమే అంతనేమోనని ఊరటజెందాను. అలాగే కొన్ని నెలలు గడచిపోయినాయి. అవల తెల్సుకున్నాను— మీ స్వభావమే అంతకాదనీ — నాతో మాట్లాడ్డం మీకిష్టం లేదనీ - నేనంటే బొత్తిగా పడదనీను.

ఈనాడు కాకపోయినా రేపైనా మీలో మార్పు కలుగు తుందన్న ఆశతోనే రెండేళ్ళు గడిపాను — నిండు రెండేళ్ళు. కానీ. మీలో మార్పుపరమాణువంతైనా కనబడ లేదు. నావంకయినా తలెత్తిచూడ్డం మానేశారు. ఇక లాభంలేదని నాఆశను బలవంతాన చంపుకున్నాను. నాతో ప్రేమగానూ, సంతోషంగానూ వుండకపోవటానికి నేను మీకుచేసిన తప్పేమిటా ? అని ఒక్కొక్కప్పుడు గంటల

తరబడి ఆలోచించేదాన్ని. కానీ, నాప్రవర్తనలో తప్పేమీ ఉన్నట్టు గోచరించదు. బాధతో హృదయం క్రుంగిపోయేది. ఆత్మహత్య చేసుకోవాలన్న తలంపుగూడా కల్గేది. పెల్లుబికివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక చేతులతో ముఖంకప్పుకుని యేడ్చేదాన్ని. ఈలాంటి సమయంలో హఠాత్తుగా నన్ను పిల్చుకపోతానని మానాన్న జాబు రాయటం, మా అమ్మ నన్ను పిల్చుకపోవటానికిరావడం నాకు కొంత మనశ్శాంతి కల్గింది నేను యిక్కడేవుంటే గూడా మీకు సుఖంవుండదని తెల్సుకున్నాను. భర్త సుఖం కోరని భార్య బ్రతికి ప్రయోజనంలేదని; మీ సుఖాన్నికోరే మా అమ్మతోగూడా పుట్టింటికి వెళ్ళిపోతున్నాను. ఇక రాను. బహుశా రాదల్చుకోలేదు గూడా! నేనిలా చెయ్యటం తప్పనితోస్తే క్షమించండి — ఇప్పటికైనా నా హృదయం అర్థంచేసుకుని వుంటారనుకుంటాను.

చివరి నమస్కారములతో శెలవు!

—మీచరణదాసి

రమ."

రమేశ్ చేతులు వొణికాయి - శరీరం గగుర్పొడిచింది - తనచుట్టూరా వున్నవస్తువులన్నీ గిర్రున తిరిగినట్టయింది - గుండెలు కూలిపోతున్నట్టు బాధపడ్డాడు. రమ వ్రాసిన ప్రత్యక్షరమూ సత్యమే! రమను అర్థం చేసుకోవటానికి తను ఏనాడూ ప్రయత్నించలేదు. కనీసం అర్థంచేసుకోవాలన్న తలంపుగూడా కలుగలేదు తనకు. పశ్చాత్తాపానలం అతని శరీరాన్ని దహించివేస్తోంది. ఇంక ఒకక్షణం ఆగలేడుతను. ఇప్పుడే వెళ్ళాలి - వెళ్ళి రమను తన ఒడిలోకితీసుకుని తన అపరాధమునకు 'శిక్ష' విధింపుమని కోరుకోవాలి — స్టేషన్‌కెళ్ళాడు.

సాయంత్రం ఐదుగంటలు కావస్తోంది. రైలు రాణీపేట స్టేషన్‌లో ఆగింది. రమేశ్ తొందరతొందరగా దిగి నడువసాగాడు. అడుగులు తడబడసాగాయి అతని మనస్సు దట్టంగా మబ్బులు పేరుకున్న ఆకాశంలావుంది. ఐదునిమిషాలకల్లా అత్తగారిల్లు చేరుకున్నాడు. ఇంటి ముంగిటికొచ్చేసరికి అరుపులు, యేడ్పులు వినిపించాయి. ఆత్రంతో లోపలికెళ్ళి - "ఏమైందేమిటి? ఎందుకేడుస్తున్నారు? రమేదీ? ఎక్కడికెళ్ళింది? కన్పించటం లేదే??—" అని గుక్కతిప్పుకోకుండా అడిగాడు.

"ఇంకెక్కడి రమరా బాబూ!" అని రమ తల్లి రాగాలుతీసింది. రమేశ్ హృదయంలో అగ్నిజ్వాలలు చెలరేగినయ్! పిచ్చివాడయ్యాడు. ఒక్క నిట్టూర్పు విడిచాడు.


## సావరిన్ స్వీట్స్

చిన్న పిల్లలే కాక, పెద్దలూకూడా సావరిన్ పిప్పరమెంట్లు, పంచదార బిళ్ళలంటే చాలా యిష్టపడతారు. ఇతర రకములు పంచదార బిళ్ళలవలెగాక, మనోహరమగు రుచి కలిగి వుండేటట్లు సావరిన్ స్వీట్స్ సమర్థులచే తయారు చేయబడుతున్నవి. వాటిలో కల్తీ లేదు; మాలిన్యము చేరకుండా శుభ్రముగా వుంటవి, ఉత్తమరకపు దినుసులతో తయారు చేయబడినవి.

## కోహినూర్ కన్ఫెక్షనరీ ప్రాడక్ట్స్

## కంపెనీ లిమిటెడ్.

మదరాసు—26

ఫోను 88124 టెలిగ్రామ్స్ LOZENGES.